క్లుప్తంగా

వర్షాలకు కూలిన ఇల్లు



ములుగు: ఐదు రోజులుగా కురుస్తున్న వర్షానికి జిల్లాకేంద్రంలోని గొల్లవాడకు చెందిన ముప్పిడి శంకరాచారి, తండ్రి వెంకటయ్యల ఇల్లు కూలిపోయింది. గతంలోనే కొంతభాగం కూలిపోగా మంళగవారం రాత్రి కుటుంబ సభ్యులు పక్కగదిలో నిద్రిస్తున్న సమయంలో గోడ కూలింది. ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు. నిరుపేద కుటుంబానికి చెందిన తమను ప్రభుత్వం ఆదుకోవాలని కుటుంబ సభ్యులు కోరుతున్నారు.

అప్రమత్తంగా ఉండండి



గోవిందరావుపేట: రానున్న రెండు రోజుల్లో భారీ వర్షాలు ఉందని వాతావరణ శాఖ సూచించడంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కాంగ్రెస్ పార్టీ ములుగు జిల్లా కార్యదర్శి గనపాక సుధాకర్ సూచించారు. బుధవారం ఆయన చల్వాయి గ్రామంలో పర్యటించారు. లోతట్టు ప్రాంతాల ప్రజల యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట వెల్పుగొండ ప్రకాశ్, కాసర్ల రాంబాబు, పెద్దపురం మొగిళి, బొనగాని సారయ్య, వెంకన్న, వచ్చవాయి సారయ్య, రమేశ్, వికాస్ రాజ్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి



ములుగు రూరల్: రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ జిల్లా కన్వీనర్ మమన్ యాదవ్ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యార్థులకు పెండింగ్‌లో ఉన్న రూ.7,500 కోట్ల స్కాలర్‌షిప్‌లను, ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను వెంటనే విడుదల చేయాలన్నారు. సంక్షేమ హాస్టళ్లలో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో టీచింగ్ స్టాఫ్‌ను నియమించడంతో పాటు మౌలిక సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం కార్యదర్శి భనిత్, అఖిల్, శ్రీతన్, జస్వంత్, మహేష్, పూర్ణ, శ్రీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

ఆదివాసీ చట్టాలు అమలు చేయాలి



ఏటూరునాగారం: ఏజెన్సీలోని ఆదివాసీ చట్టాలను అమలు చేయాలని తుడుందెబ్బ జిల్లా అధ్యక్షులు వట్టం జనార్దన్ అన్నారు. మండలకేంద్రంలో బుధవారం నిర్వహించిన ఆదివాసీ సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. కొన్ని గ్రామాల్లో ఆదివాసీలు పోడు భూముల్లో వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారని తెలిపారు. ఆ భూములను అటవీశాఖ అధికారులు అక్రమంగా లాక్కునే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఆదివాసీ చట్టాలను అమలు చేయాలని కోరారు. ఈ సమావేశంలో కావుల సమ్మయ్య, నీలాద్రి, తాటి సురేష్, నాగేశ్వర్‌రావు, చింరజీవి తదితరులు పాల్గొన్నారు.

నియామకం

కన్నాయిగూడెం: బీజేపీ దళిత మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధిగా జాడి రామరాజు నేతను నియమిస్తూ రాష్ట్ర దళిత మోర్చా అధ్యక్షుడు కొండేటి శ్రీధర్ ప్రకటించారు. బుధవారం నియామక పత్రాన్ని అందించారు.

ఆస్పత్రిలో పండ్ల పంపిణీ



ఏటూరునాగారం : మండల కేంద్రంలోని సామాజిక వైద్య శాఖ సూపరింటెండెంట్ డాక్టర్ సురేశ్‌కుమార్ పుట్టినరోజు సందర్భంగా బుధవారం ఆస్పత్రిలో కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా రోగులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్యులు, హెడ్ నర్సు, సిబ్బంది పాల్గొన్నారు.



వాజేడు: మాట్లాడుతున్న ముత్తమ్మ



కన్నాయిగూడెం: అవగాహన కల్పిస్తున్న అంగన్ వాడీ సిబ్బంది

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

● ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఆఫ్రిన్

ఏటూరునాగారం: అంగన్‌వాడీ కేంద్రాల్లో లభ్యం అయ్యే పౌష్టికాహార పదార్థాలను సక్రమంగా తీసుకున్నట్లయితే గర్భిణీ స్త్రీలు ఆరోగ్యకరమైన శిశువులకు జన్మనిస్తారని ఏటూరునాగారం ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఆఫ్రీన్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని తీగలవాయి–1 అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ్ అభియాన్ మాసోత్సవాల్లో భాగంగా నిర్వహించిన సమావేశంలో ఆఫ్రీన్ మాట్లాడారు. కొంత మంది ప్రసవం సమయంలో రక్తం సరిగా లేక అనేక ఇబ్బందులకు గురవుతుంటారని, అలాంటి సమయాల్లో శిశువులు కూడా చనిపోవడం జరుగుతుందని అన్నారు. గ్రామాల్లో లభ్యమయ్యే అన్ని రకాల ఆకుకూరలు కూరగాయలతోపాటు అంగన్‌వాడీ కేంద్రాల్లో అందించే పౌష్టికాహారంతో ఇలాంటి ఇబ్బందులు తొలిగిపోతాయని వివరించారు. చిన్నారులను విధిగా అంగన్‌వాడీ కేంద్రాలకు పంపించాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో ఇచ్చే ఆహారంతో కిశోర చిన్నారుల్లో ఎదుగుదల ఉంటుందన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్‌లు ఇరుస వడ్ల సరోజ, వసంత, భవాని హెల్పర్ రోజా పాల్గొన్నారు.

పోషక ఆహారం అందించాలి

వాజేడు: అంగన్‌వాడీ కేంద్రంలోని ప్రతీ విద్యార్థితోపాటు గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం అందించాలని వెంకటాపురం(కె) ఐసీడీఎస్ సీడీపీఓ ముత్తమ్మ అన్నారు. మండల పరిధిలోని సుందరయ్య కాలనీ అంగన్ వాడీ కేంద్రంలో పోషణ మాసోత్సవం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతీ ఒక్కరు పోషక విలువలున్న ఆహారాన్ని తీసుకోవాలన్నారు. ఎత్తు, బరువు తక్కువగా ఉన్న పిల్లలను గుర్తించి వారిపై ప్రత్యేక శ్రద్ధ కనబర్చాలని సూచించారు.

ముప్పనపల్లి, లక్ష్మీపురం గ్రామాల్లో..

కన్నాయిగూడెం: గర్భం దాల్చిన నాటినుంచి ప్రసవం వరకు పోషక పదార్థాలతో కూడిన ఆహారం తీసుకోవడం ద్వారా పుట్టబోయే బిడ్డ సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని సీడీపీఓ ప్రేమలత అన్నారు. బుధవారం మండలంలోని ముప్పనపల్లి, లక్ష్మీపురం గ్రామాల్లోని అంగన్ వాడీ కేంద్రాల్లో పోషణ మాసం కార్యక్రమంలో భాగంగా గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో నీతిఅయోగ్ కో ఆర్డినేటర్ రవీశ్, అంగన్‌వాడీ సిబ్బంది రజిత, ఖమ్మరునిషా, సూరమ్మ, తిరుపతి, పార్వతి, అనిత, తదితరులు పాల్గొన్నారు



ఏటూరునాగారం: అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్ ఆఫ్రీన్

ఉత్తమ ఉపాధ్యాయులు వీరే...

ములుగు: సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకుని నేడు(గురువారం) కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో గురుపూజోత్సవం కార్యక్రమం నిర్వహించనున్నట్లు డీఈఓ పాణిని బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా జిల్లాలో ఉత్తమ సేవలు అందించిన ఉపాధ్యాయులకు జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలు ప్రదానం చేయనున్నట్లు తెలిపారు. దీనిలో భాగంగా జిల్లాలో దరఖాస్తు చేసుకున్న ఉపాధ్యాయుల నుంచి 15మందిని ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపిక చేసినట్లు తెలిపారు. వీరికి ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలు అందజేయనున్నట్లు వెల్లడించారు.

ఎంపికైన ఉపాధ్యాయులు..

1.జెడ్పీహెచ్‌ఎస్ అబ్బాపూర్ నుంచి జి.భాస్కర్ 2.జెడ్పీహెచ్‌ఎస్ కోయగూడెం నుంచి బి.శ్రీనివాస్ 3.జెడ్పీహెచ్‌ఎస్ ఏటూరునాగారం నుంచి జి.వెంకటరమణ 4. జెడ్పీహెచ్‌ఎస్ మంగపేట నుంచి సీహెచ్.మాధురిదేవి 5.ఎంపీయూపీఎస్ కొమిటిపల్లి నుంచి కె. సతీష్ 6.ఎంపీపీఎస్ ముద్దునూరుతండా నుంచి ఏ.జ్యోతి 7.డీఎన్‌టీపీఎస్ మాన్‌సింగ్‌తండా నుంచి పి.స్వప్న 8.ఎంపీపీఎస్ ఎల్లారెడ్డిపల్లె నుంచి పి.రమేష్ 9. ఎంపీపీఎస్ చింతగూడెం నుంచి పి.సతీష్ కుమార్ 10.ఎంపీపీఎస్ నాగారం నుంచి ఈ.బాలాజీ, 11.కేజీబీవీ ములుగు నుంచి కె.జీవనప్రియ, 12.టీఎస్ఎంఎస్ చల్వాయి నుంచి బి.రవి 13. లిటిల్ ఫ్లవర్ హై స్కూల్ ములుగు నుంచి రేగిచాకో 14.సెయింట్ అంథోని హై స్కూల్ ములుగు నుంచి బి.రవి 15.ఆదర్శ హై స్కూల్ కమలాపూర్ నుంచి వల్లూరిపల్లి బిందులు ఎంపికయ్యారు.

'పశువులకాపరులు అడవికి వెళ్లొద్దు'

ములుగు: భారీ వర్షాలతో వాగులు వంకలు పొంగుతున్న నేపథ్యంలో పశువులకాపరులు అడవుల్లోకి వెళ్లకూడదని ములుగు డీఎస్పీ రవీందర్ బుధవారం ఒక ప్రకటనలో సూచించారు. ఎట్టి పరిస్థితిలో వాగులు దాటే ప్రయత్నం చేయకూడదని తెలిపారు. వరుసగా కురుస్తున్న వర్షాలకు ఇళ్ల గోడలు పూర్తిగా నాని విద్యుత్ ప్రమాదం జరగడానికి ఆస్కారం ఉందని, వర్షాలు తగ్గుముఖం పట్టేవరకు విద్యుత్ పనులు చేయొద్దని సూచించారు. శిథిలావస్థకు చేరిన ఇళ్లలో ఉండొద్దని తెలిపారు. వాతావరణ శాఖ జిల్లాను ఎల్లో అలెర్ట్‌గా ప్రకటించిన నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు.

ఆలయంలో చోరీ

మంగపేట: మండలంలోని మల్లూరు బీసీ కాలనీలోని సాయిబాబా ఆలయం, కిరణా షాపులో మంగళవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. ఆలయంలో హుండీ పగుల గొట్టి అందులోని సుమారు రూ.4 వేల వరకు భక్తులు సమర్పించిన కానుకలను అపహరించారు. పక్కనే ఉన్న గడ్డం లక్ష్మీనారాయణకు చెందిన కిరాణం షాపు(డబ్బా) తాళం పగుల గొట్టి అందులోని చిల్లర నాణేలు రూ.6,000 విలువైన సామగ్రి తీసుకెళ్లినట్లు బాధితుడు లక్ష్మీనారాయణ తెలిపాడు. చోరీ జరిగిన విషయంపై స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసునమోదు చేసి ఎస్సై టీవీఆర్ సూరీ ఆధ్వర్యంలో క్లూస్ టీం సిబ్బంది సంఘటనా స్థలాలను పరిశీలించి ఆధారాలను సేకరించి దర్యాప్తు చేస్తున్నారు.



ఆలయంలోని హుండీ

ఎకరానికి రూ.25,000 పరిహారం ఇవ్వాలి

● భూక్యా జంపన్న

గోవిందరావుపేట: గత వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు మండలంలోని రైతులు తీవ్రంగా నష్ట పోయారని, నష్టపోయిన ప్రతి రైతుకు ఎకరానికి రూ.25,000 నష్ట పరిహారం ఇవ్వాలని బీఆర్‌ఎస్ పార్టీ జిల్లా నాయకుడు భూక్యా జంపన్న అన్నారు. మండల పరిధిలోని పస్రా, గాంధీనగర్, బాలాజీ నగర్, చంద్రుతండా, పాపయ్యపల్లి గ్రామాల్లో బుధవారం పర్యటించారు. ఈ సందర్భంగా జంపన్న మాట్లాడుతూ రైతులు నాటు వేసి 40రోజులు అవుతుందని, ప్రతి రైతు ఇప్పటి వరకు ఒక ఎకరానికి రూ.25,000 పెట్టుబడి పెట్టాడని తెలిపారు. వర్షాల వల్ల కాలువలకు గండ్లు పడి పొలాల్లో ఇసుక మేటలు వేసిందన్నారు. పంట నష్టపోయిన ప్రతి రైతుకు పరిహారం చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు లకావత్ నరసింహానాయక్, పోరిక స్వామి, అజ్మీరా నరసింహ, రాజు, అనిల్, సుమన్, శ్రీను, విక్రమ్, శ్రీను రెడ్డి, రమేష్, తదితరులు పాల్గొన్నారు.



పాపయ్యపల్లిలో వరిని పరిశీలిస్తున్న నాయకులు

బాధిత కుటుంబాలకు పరామర్శ

మంగపేట: మండలంలోని వివిధ గ్రామాల్లో బీఆర్‌ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్, మాజీ జెడ్పీ చైర్మన్ బడే నాగజ్యోతి విస్తృతంగా పర్యటించి ఇటీవల మృతి చెందిన బాధిత కుటుంబాలను బుధవారం పరామర్శించారు. మండలంలోని బ్రాహ్మణపల్లి బీఆర్‌ఎస్ గ్రామకమిటీ అధ్యక్షుడు పాండా శ్రీనివాస్ కుమార్తె బొగ్గం పూజ ఇటీవల మృతి చెందగా ఓదార్చారు. వాడగూడెంలో చిక్కుళ్ల రమణ ఇటీవల మృతి చెందగా పరామర్శించారు. ఒక్కో కుటుంబానికి రూ.5,000 అందజేశారు. కత్తిగూడెంలో ఇమ్మడి ఎల్లయ్య ఇటీవల మృతి చెందగా బాధిత కుటుంబాన్ని పరామర్శించి రూ.2,000 అందజేశారు. అనంతరం అకినేపల్లిమల్లారంలో కంటి ఆపరేషన్ చేయించుకుని వైద్యం పొందుతున్న ప్రశాంత్, కొత్త మల్లూరు(బెస్తగూడెం)లో కొద్ది రోజుల క్రితం విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు కాలిపోయిన రెబ్బల రాములు కుటుంబంతోపాటు అనారోగ్యంతో బాధపడుతున్న తిమ్మంపేటకు చెందిన బోడ ప్రవీణ్‌ను పరామర్శించారు. ఆమె వెంట బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు కుడుముల లక్ష్మీనారాయణ, ఎఫ్ఎస్‌సీఎస్ చైర్మన్ తోట రమేశ్, నాయకులు రాజుయాదవ్, రాజేందర్, కొమరం ధనలక్ష్మి, లక్ష్మణ్‌రావు, తిరుపతి, శోభన్, సోషల్ మీడియా ఇన్‌చార్జ్ గుడివాడ శ్రీహరి ఉన్నారు.



బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న నాగజ్యోతి

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం



సాయం అందజేస్తున్న దాతలు



ఆర్థిక సాయం అందజేస్తున్న ట్రస్టు బాధ్యులు

మంగపేట: మండలంలోని కత్తిగూడెంలో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన ఇమ్మడి ఎర్రయ్య కుటుంబాన్ని శ్రీ రామకృష్ణ సేవాట్రస్టు చైర్మన్ బాడిష నాగరమేశ్ ఆధ్వర్యంలో ట్రస్ట్ బాధ్యులు బుధవారం పరామర్శించి ఆర్థిక సాయం అందచేశారు. నిరుపేద కుటుంబానికి చెందిన ఎర్రయ్య మృతి చెందడంతో బాధిత కుటుంబం ఎదుర్కొంటున్న ఇబ్బందిని ట్రస్ట్ సభ్యుల ద్వారా తెలుసుకున్న చైర్మన్ రమేశ్ రూ.2,000, 25 కేజీల బియ్యాన్ని అందచేశారు. పేదప్రజలకు అండగా ఉంటు ఆపత్కర పరిస్థితుల్లో చేయూతనందిస్తు నిరంతర సేవలు అందిస్తున్న అండగా నిలుస్తున్న ట్రస్టు చైర్మన్ రమేశ్‌ను ఈ సందర్భంగా గ్రామస్తులు అభినందించారు. కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు కిశోర్, శేఖర్, వెంకటనారాయణ, నర్సింహారావు, సుధీర్, నాగేశ్, మురళి, బాషా, అబ్బయ్య, సతీశ్ తదితరులు పాల్గొన్నారు.

చేయూతనిచ్చారు

కన్నాయిగూడెం: మండలంలోని కంతనపల్లికి చెందిన కంపెల్లి సరస్వతి కిడ్నీ సమస్యతో హనుమకొండలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. వారిది పేద కుటుంబం కావడంతో అంత ఖర్చు పెట్టలేక దాతలు సాయం చేయాలని దాతలను కోరారు. ఈక్రమంలో ముప్పనపల్లి సహాయ నిధి సభ్యులు అబ్బు సతీశ్ ఆధ్వర్యంలో బుధవారం రూ.17వేలు బాధిత కుటుంబానికి అందించారు. దాతల్లో వనం ప్రవీణ్, ఎండీ ఫైజొద్దిన్, ఏజాజ్, శంకర్ తదితరు పాల్గొన్నారు.

పెసా గ్రామసభలు నిర్వహించాలి

మంగపేట: మండలంలోని అన్ని గ్రామపంచాయతీల్లో పెసా గ్రామసభలను నిర్వహించి ఆయా గ్రామసభల తీర్మానం మేరకు అన్ని ప్రభుత్వ సంక్షేమ అభివృద్ధి పథకాలను ప్రజలకు చేరే విధంగా కృషి చేయాలని పెసా జిల్లా అధ్యక్షుడు డబ్బుల ముత్యాలరావు ఎంపీడీఓ భద్రును కోరారు. నూతనంగా ఎంపీడీఓగా బాధ్యతలు స్వీకరించిన భద్రును నాయకులు మర్యాద పూర్వకంగా బుధవారం కలిసి పూల బొకేను అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలోని 25 గ్రామ పంచాయతీల్లో పెసా చట్టాన్ని అమలులో బలోపేతం చేయాలని కోరారు. పెసా గ్రామసభలను షెడ్యూల్ ప్రకారం నిర్వహించి మండల అభివృద్ధికి కృషి చేయాలని, అందుకు తమవంతు పూర్తి సహకారం ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు పాయం రమేశ్, పాదెం నగేశ్, తాటి విజయ్‌బాబు తదితరులు పాల్గొన్నారు.



ఎంపీడీఓకు పూలబొకే అందజేస్తున్న నాయకులు

జ్వరాలపై ఇంటింటా సర్వే

వాజేడు: వాజేడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని బొల్లార, ఆరుగుంట పల్లి గ్రామాల్లో బుధవారం వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది జ్వరాల తీవ్రతపై ఇంటింటి సర్వే నిర్వహించారు. జిల్లా వైద్యాధికారి అప్పయ్య, ప్రోగ్రాం ఆఫీసర్ భవ్యశ్రీ ఆదేశాల మేరకు ఈ సర్వేను నిర్వహించారు. జ్వర పీడితుల నుంచి రక్త నమూనాలను సేకరించారు. ఇంటి పరిసరాల్లోని పాత వస్తువులు, టైర్లల్లో ఉన్న నీటిని పారబోశారు. నిలువ నీటిని తొలగించారు. జ్వరం వస్తే తప్పని సరిగా ప్రభుత్వ వైద్య శాలకు రావాలని సూచించారు. మురుగు నీటి గుంతల్లో తీమోపాస్ మందును చల్లారు. రెండు గ్రామాల్లో వైద్యులు మహేందర్, గ్యానస రోగులను పరిక్షించి మందులను అందించారు. ఈ కార్య క్రమంలో కోటి రెడ్డి, శేఖర్, ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

ఆరోగ్య శిబిరం

వెంకటపురం(కె):సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని భవ్యశ్రీ అన్నారు. బుధవారం మండలంలోని రామచంద్రపురంలో డాక్టర్ భవ్యశ్రీ వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. గ్రామంలో సిబ్బందితో ఇంటింటి ఫీవర్ సర్వే నిర్వహించి ఫీవర్‌తో ఉన్నవారికి గుర్తించి పరీక్షలు నిర్వహించి అవసరం ఉన్నవారికి మందులు పంపిణీ చేశారు. అనంతరం గ్రామంలో డ్రై డే నిర్వహించారు. అనంతరం గ్రామంలో సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రోగ్రాం అధికారి వెక్టర్ జనన ఆశాలు పాల్గొన్నారు.



వాజేడు: రోగులను పరీక్షిస్తున్న వైద్య సిబ్బంది



వాజేడు: మురుగు నీటి గుంతలో తీమోపాస్ చల్లుతున్న వైద్య సిబ్బంది



రామచంద్రపురంలో వైద్య శిబిరం..

ఏజెన్సీ రైతుల రుణాలు మాఫీ చేయాలి



బొగ్గువాగు వద్ద రైతులతో మాట్లాడుతున్న రవిగౌడ్

ములుగు రూరల్: పహాణీ నకల్ ఆధారంగా పంటరుణాలు పొందిన ఏజెన్సీ రైతులకు ప్రభుత్వం రూ.2లక్షల రుణమాఫీ వెంటనే చేయాలని రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యుడు గుండబోయిన రవిగౌడ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం బొగ్గువాగు వద్ద రైతులతో సమావేశం నిర్వహించి ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో ఏజెన్సీ ప్రాంతాల్లోని రైతులకు 75శాతం పట్టాదార్‌పాస్ పుస్తకాలు అందలేదన్నారు. ప్రభుత్వం పట్టాదార్‌పాస్‌పుస్తకాలు ఉన్న రైతులకు మాత్రమే రుణమాఫీ చేయడంతో పహాణీపై రుణాలు పొందిన రైతులు నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ప్రకటించిన రుణమాఫీలో 50శాతం మందికి మాత్రమే రుణమాఫీ వర్తించిందని తెలిపారు. షరతులు లేకుండా రైతులందరికీ రుణమాఫీ వర్తింపచేయాలన్నారు. కొండల్‌రావు, జాజ నర్సింహులు, తిరుపతి, భిక్షపతి, నాగరాజు, వీరస్వామి, సాంబయ్య, రమేష్, నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

బీజేపీలో పలువురి చేరిక

కాటారం: మహాముత్తారం మండలం నల్లగుంట మీనాజిపేటకు చెందిన మాజీ సర్పంచ్ ముత్యాల రాజుతోపాటు పలువురు బుధవారం బీజేపీ పార్టీలో చేరారు. కాటారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో బీజేపీ రాష్ట్ర నాయకుడు చల్ల నారాయణరెడ్డి సమక్షంలో పార్టీలో చేరారు. పార్టీలో చేరిన వారిలో ఐలయ్య, సమ్మయ్య, రఘు, నర్సింహారెడ్డి, చందు, అరవింద్, స్వామి ఉన్నారు.

బుస్సాపూర్‌లో ఎయిడ్స్‌పై అవగాహన

గోవిందరావుపేట: మండల పరిధిలోని బుస్సాపూర్ గ్రామంలో బుధవారం తెలంగాణ రాష్ట్ర ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ ఆధ్వర్యంలో ఎయిడ్స్ పై ఇంటింటికి తిరుగుతూ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వైఆర్‌జీ కేర్ లింక్ వర్కర్ కిషన్ హాజరై మాట్లాడారు. ప్రతి ఒక్కరికీ హెచ్ఐవీ ఎయిడ్స్ మీద అవగాహన ఉండాలని అన్నారు. హెచ్ఐవీ నాలుగు మార్గాల ద్వారా వస్తుందని వివరించారు.



అవగాహన కల్పిస్తున్న సంస్థ ప్రతినిధులు

గ్రామాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న వెంకటరెడ్డి

వెంకటపురం(కె): గ్రామాల్లో వైద్య సిబ్బంది వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని సీపీఎం జిల్లా కార్యకార్యదర్శి తుమ్మల వెంకటరెడ్డి కోరారు. బుధవారం ఆయన సీపీఎం కార్యాలయంలో మండలవంక రాములు అధ్యక్షతన నిర్వహించిన మండల పార్టీ సమావేశంలో మాట్లాడారు. గ్రామాల్లో సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందుతున్నాయన్నారు. వెంటనే వైద్య సిబ్బంది మండలంలోని అన్ని గ్రామాల్లో వైద్య శిబిరాలు ఏర్పాట చేయాలని సూచించారు. మండలంలో గత కొంతకాలం నుంచి కురుస్తున్న వర్షాలతో ప్రధాన రోడ్లతోపాటు అంతర్గత రోడ్లు పూర్తిగా పాడయ్యాయని అధికారులు చొరవతీసుకోవాలని డిమాండ్ చేశారు. పార్టీ నాయకులు సాంబశివ, వాసు, కుమ్మరి శ్రీను, సత్యం, ఆదినారాయణ, నాగేశ్వర్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

రోడ్ల మరమ్మతులు చేపట్టాలి

వెంకటాపురం(కె): గత కొన్ని రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలతో జిల్లాలోని ప్రధాన రహదారులు పూర్తిగా పాడయ్యాయని వెంటనే మరమ్మతు పనులు చేపట్టాలని సీపీఐ జిల్లా కార్యదర్శి మల్లికార్జున్ బుధవారం ఒక ప్రకటనలో అధికారులను కోరారు. పాడైన రోడ్లపై నుంచి ఇతర ప్రాంతాలకు ప్రయాణం చేయాలంటే అనేక ఇబ్బందులు పడాల్సి వస్తుందని తెలిపారు.

ఛత్తీస్‌గఢ్, తెలంగాణకు రాకపోకలు బంద్

వాజేడు: ఛత్తీస్‌గఢ్, తెలంగాణ అంతర్ రాష్ట్ర రాకపోకలు నిలిపివేస్తున్నట్లు ఏటూరునాగారం ఏఎస్పీ శివం ఉపాధ్యాయ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు టేకుల గూడెం సరిహద్దులోని రేగు మాకు ఒర్రె వద్ద గోదావరి వరద రహదారి పై నుంచి ప్రవహిస్తుందని తెలిపారు. దీని కారణంగా రెండు రాష్ట్రాల మధ్యన రాకపోకలను నిలిపివేసినట్లు వెల్లడించారు. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రానికి వెళ్లాల్సిన వారు ములుగు, భూపాలపల్లి వయా కాళేశ్వరం మీదుగా వెళ్లాలని సూచించారు. ప్రజలు సహకరించాలని ఆయన కోరారు.

అప్రమత్తమైన అధికారులు

వాజేడు: గోదావరి వరద ఉధృతంగా పెరుగుతుండటంతో జిల్లా, మండల అధికారులు అప్రమత్తమయ్యారు. పలు చోట్ల రహదారుపైకి వరద నీరు చేరడంతో అటు వైపుగా ప్రజలు వెళ్ల కుండా రహదారులకు అడ్డంగా బారీకేడ్లను ఏర్పాటు చేశారు. ఏటూరునాగారం ఏఎస్పీ శివం ఉపాధ్యాయ మండల పోలీసులను అప్రమత్తం చేశారు. పేరూరు, వాజేడు ఎస్సైలు కృష్ణ ప్రసాద్, హరీశ్ తమ సిబ్బందితో రహదారుపైకి వరద నీరు చేరిన ప్రదేశానికి వెళ్లి హెచ్చరిక చేయడంతోపాటు బారీ కేడ్లను అమర్చారు. మండల ప్రత్యేకాధికారి సర్దారింగ్, ఎంపీడీఓ విజయ, పేరూరు ఎస్సై కృష్ణ ప్రసాద్ టేకుల గూడెంకు వెళ్లి ప్రజలకు పలు సూచనలను చేశారు.



అవగాహన కల్పిస్తున్న అధికారులు